క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో కనకదుర్గమ్మ అమ్మవారు

బద్వేలు అర్బన్ : స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్ ఆవరణలోని సబ్ జైలు సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో నిజశ్రావణమాసం మూడవ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవ, పంచామతాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే అమ్మవారిని సంపంగి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాజ, నాగభూషణం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరి మాత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామ లింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జామున రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు, సైకతలింగానికి రుద్రాభిషేకం, చండీమాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి కాయాకర్పూరాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ప్రొద్దుటూరు : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని శుక్రవారం 15 సచివాలయాల్లో అధికారులకు సీపీఎం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్యాస్, పెట్రోలు, డీజిల్ ధరలు, కరెంటు చార్జీలు పెంచి పేదలపై భారం మోపిందని విమర్శించారు. ఈనెల 4న ఈ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు ముంతాజ్ బేగం, వెంకటసుబ్బమ్మ, భానుమతి, లక్ష్మీదేవి, రాములమ్మ, గురమ్మ, సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజీవ్ బాషా

పోరుమామిళ్ల : మండల కేంద్రానికి చెందిన రాజీవ్ బాషాను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శుక్రవారం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు నియమించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి రాజీవ్‌బాషాకు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో జిల్లా పదవికి ఎంపిక చేసినందుకు సురేష్‌బాబుకు, సహకరించిన ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు రమణారెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, బోడపాడు రామసుబ్బారెడ్డి, రాళ్లపల్లె నరసింహులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను తగ్గించండి

పోరుమామిళ్ల : విద్యుత్ కోతలపై శుక్రవారం సీపీఐ నాయకులు డీఈఈ విజయకుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల విద్యుత్ కోతలు అధికమయ్యాయని, రాత్రిళ్లు గంటలు, గంటలు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం, మరోవైపు దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరారు. డీఈఈ విజయకుమార్ మాట్లాడుతూ వర్షాభావంతో విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని, త్వరలో పూర్తి సమాచారంతో ప్రకటన చేస్తామన్నారు.

రేపు ఆర్యవైశ్య సభ సమావేశం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్యవైశ్య సభ 133వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాం మోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 జమా ఖర్చులను ఆమోదించుట, గత సర్వసభ్య సమావేశం నుంచి నేటి వరకు జరిగిన కార్యక్రమాలు తెలపడం, ఆమోదించడం తదితర వాటిని సమావేశంలో చర్చిస్తారన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య సభ సభ్యులు, 18 సంవత్సరాలు నిండిన ఆర్యవైశ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని గెలిపించండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



లబ్ధిదారునికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసిందా లేదా జగన్ ప్రభుత్వం మేలు చేసిందా అనేది గుర్తించి మేలు చేసిన ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో శుక్రవారం నూతనంగా వైఎస్సార్ పింఛన్ల కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 41 వార్డులకు సంబంధించి 15,193 మందికి ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వార్డు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ల సొమ్మును అందిస్తున్నారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్ని ఇబ్బందులు పడాల్సి వచ్చేదో మీకందరికి తెలుసునన్నారు. 65 ఏళ్లు నిండితే చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసేదన్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల వయసు తగ్గించి 60 ఏళ్లకే మరింత మందికి పింఛన్ అందిస్తోందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో నూతనంగా 737 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలను రూపొందించారని తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. అనంతరం నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కమిషనర్ పి.వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, పాతకోట మనివంశీధర్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భూమి పూజ

మండలంలోని కొత్తపల్లె పంచాయతీలోని టీచర్స్ కాలనీలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేశారు. వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ రెడ్డి , ఎంపీపీ శేఖర్ యాదవ్, పోరెడ్డి నరసింహారెడ్డి, శౌరి సుబాష్‌రెడ్డి, పేరం బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచ్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ ప్రయోజనానికి ప్రభుత్వం కృషి



కొండుగారిపల్లె కాలువకు నీరు విడుదల చేస్తున్న గోవిందరెడ్డి, నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల చెరువు నుంచి కొండుగారిపల్లె వద్ద గేట్లు ఎత్తి శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పంచాయతీ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈరోజు సిద్దవరం, చల్లగిరిగెల, గానుగపెంట ప్రాంత వ్యవసాయ భూములకు ఆరుతడి పంటలు సాగు చేసుకొనేందుకు నీరు విడుదల చేశామన్నారు. రైతులు వరి లాంటి నీటి ఆధారిత పంటలు సాగు చేయరాదన్నారు. బ్రహ్మంసాగర్ నుంచి 500 క్యూసెక్కుల నీరు విడుదల చేయగా 300 క్యూసెక్కులు వస్తున్నాయన్నారు. పోరుమామిళ్ల చెరువులో 0.40 టీఎంసీల నీరుందని, వానలు లేక నీటి సమస్య ఉందన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల ప్రయోజనానికి ముఖ్యమంత్రి అన్ని విధాల కృషి చేస్తున్నారన్నారు. బ్రహ్మంసాగర్‌లో పూర్తి స్థాయి నీరు నిల్వ చేశామన్నారు. రైతు భరోసా కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమణారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, సింగల్‌విండో అధ్యక్షుడు వెంగళరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, సర్పంచులు రమణారెడ్డి, గురయ్య, గిరిప్రణీత్‌రెడ్డి, నాయుడు డీఈఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిఫ్ట్ స్కీంను సద్వినియోగం చేసుకోండి

బద్వేలు అర్బన్ : బద్వేలు నుంచి కడపకు ఆర్టీసీ బస్సుల్లో తిరిగే ప్రయాణీకులు గిఫ్ట్ స్కీం విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు నుంచి కడపకు వెళ్లే పల్లె వెలుగు బస్సులో ప్రయాణిస్తూ స్కీం గురించి ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బద్వేలు డిపో నుంచి కడప రూట్‌లో అల్ట్రా పల్లె వెలుగు, పల్లెవెలుగు బస్సులలో ప్రయాణించే ప్రయాణీకులు వారి గమ్యస్థానాలకు చేరిన అనంతరం వారి టికెట్ వెనుక పేరు, ఫోన్ నెంబర్ రాసి బస్సులో ఉన్న గిఫ్ట్‌బాక్స్‌లో వేయాలని, ప్రతి నెల రెండవ, నాల్గవ శుక్రవారాల్లో డ్రా తీసి బహుమతులు అందజేస్తామన్నారు.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు

పోరుమామిళ్ల : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పిలుపిచ్చారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించాలన్నారు. పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఉదయం 7 గంటలకు పేదలకు చీరల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొనాలని కోరారు.

ఘన సన్మానం



ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగరాజును సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు యోగివేమన యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం కళాశాలలో కాలేజి నాన్ టీచింగ్ ట్రేడ్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పోతిరెడ్డి ప్రకాష్‌రెడ్డి తదితరులు ప్రిన్సిపాల్ సి.నాగరాజును పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజశేఖర్, రామదాసు, ధనసూదన్ రెడ్డి, నాగేశ్వర్లు పాల్గొన్నారు.

అధిక ఎరువుల వాడకంతో అనర్థాలు



వరిపైరులో రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు ఇస్తున్న దృశ్యం

అట్లూరు : అధిక ఎరువుల వాడడం వలన అనర్థాలు తెచ్చుకున్నట్లని సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మా) శాస్త్రవేత్త డాక్టరు వీరయ్య పేర్కొన్నారు. బద్వేలు వ్యవసాయ డివిజన్ అనంతరాజుపురం రైతు భరోసా కేంద్రం పరిధిలోని వరి సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం శుక్రవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు, ఆకు ముడత ఆకు నల్లి వంటి చీడపీడలను గుర్తించి తగు సూచనలు సలహాలు చేశారు. అలాగే యూరియా అవసరానికి మించి వాడుతున్నారని అలా వాడడం వలన అనర్థాలు ఎక్కువ అవుతాయన్నారు. అనంతరం వనిపెంట శాస్త్రవేత్త డాక్టర్ హర్షిత మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలన్నారు. అలాగే జింక్ సల్ఫేట్, పొటాష్ ఎరువుల వాడకంపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం రైతు శిక్షణా కేంద్రం ఏఓ పద్మజ మాట్లాడుతూ వరిలో కాలిబాటలు వరినారు కొసలు తుంచి నాటాలని పేర్కొన్నారు. అలాగే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పద్మలత, మండల వ్యవసాయ అధికారి చంద్రమోహన్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రాల సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీయస్ రద్దు హామీని నిలబెట్టుకోవాలి

పోరుమామిళ్ల : లక్షలాదిమంది ఉద్యోగులకు గొడ్డలిపెట్టులా మారిన సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి. రమణారెడ్డి, రాష్ట్ర కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం సాయంత్రం ఎస్టీయూ భవన్‌లో నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేస్తుంటే, ఏపీలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని వారు ప్రశ్నించారు. తమ లక్ష్యం పాత పెన్షన్ అమలు మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జోత్స్న స్వర్ణలత పేర్కొన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని తిరువెంగళాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పసిబిడ్డ సులభంగా జీర్ణించుకోవడంతో పాటు ఖనిజ పదార్థాలను, మాంసకృత్తులను పొందగలుగుతారని తెలిపారు. తల్లి తొలినాళ్లలో ఇచ్చే ముర్రుపాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతల, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం పోషకాహార కిట్లను అందజేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సీహెచ్‌ఓ హర్షిత, హెల్త్ అసిస్టెంట్లు జనార్దన్‌రావు,మహాలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

398 నూతన పింఛన్లు మంజూరు

చాపాడు : మండలంలోని 15 గ్రామ సచివాలయాలకు సంబంధించి 398 నూతన పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. చిన్న గురువలూరుకు 40, పెద్దగురువలూరుకు 37, చియ్యపాడుకు 31, అన్నవరం 21, సోమాపురం 41, లక్ష్మీపేట 36, పల్లవోలు 32, ఖాదర్‌పల్లి 16, వెదురూరు 31, అయ్యవారిపల్లె 10, బద్రిపల్లి 22, ఎన్‌ఓపల్లి 30, చాపాడు 9, మడూరు 30, అల్లాడుపల్లి 8 పింఛన్లు మంజూరైనట్లు ఆయన వివరించారు. శుక్రవారం నుంచి పింఛన్లను పంపిణీ చేస్తునట్లు తెలిపారు.

సాహితీ శిఖరం పుట్టపర్తి

ప్రొద్దుటూరు కల్చరల్ : పుట్టపర్తి నారాయణాచార్యులు సాహితీ రంగంలో శిఖర సమానుడని అగస్త్యేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి నారాయణాచార్యుల వర్ధంతిని పురస్కరించుకుని శివాలయం సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి రచించిన శివతాండవం కావ్యం ఆయనకు ఎంతో పేరు తెచ్చిందన్నారు. శివాలయంలోనే ఆ కావ్యాన్ని రచించడం ప్రొద్దుటూరు ప్రజల అదృష్టమన్నారు. సాహితీ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం తపాల బిల్ల విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పుట్టపర్తి సాహితీ పీఠం అధ్యక్ష, కార్యదర్శులు వంకదార వీరభద్రయ్య, జింకా సుబ్రహ్మణ్యం, కాశీవరపు వెంకటసుబ్బయ్య, కొత్తపల్లె శీను, తవ్వా సురేష్, ప్రభుకుమార్, ఆరవేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

మైదుకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య కోరారు. మైదుకూరు ఎంఆర్‌సీ ఆవరణలో రీజనల్ కన్వీనర్ బీకే సురేష్ ఆధ్వర్యంలో ఎస్టీయూ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సీపీఎస్ అమలులోకి వచ్చి 19 ఏళ్లు పూర్తయిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయ జీవితాలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టాయని ఆరోపించారు. కేంద్ర, ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా నాలుగేళ్లుగా కమిటీలతో, చర్చలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాల్సిందేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్ అమౌంట్ రూ.800 కోట్లు విడుదల చేసి వారి అకౌంట్‌కి జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు కేవీ రాజు, ఈశ్వరయ్య, మనోహర్, రాజేష్, రామచంద్రుడు, నారాయణ, ప్రసాద్, నాగరాజు, సుబ్బారావు, భగవాన్, రాధా నరసింహారాజు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో వీఆర్‌ఏ మృతి

చాపాడు : మండల పరిధిలోని బద్రిపల్లె గ్రామానికి చెందిన వీఆర్‌ఏ బండి పుల్లయ్య (47) శుక్రవారం విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందాడు. చాపాడులోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మధ్యాహ్నం విధుల్లో ఉండగా ఒక్క సారిగా కుప్పకూలిపోవడంతో తోటి సిబ్బంది స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వీఆర్‌ఏ కుటుంబానికి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తహసీల్దార్ సుభాని తెలిపారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

దువ్వూరు : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇడమడక సచివాలయం పరిధిలోని ఐ.బయనపల్లె గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొంత మంది మహిళలు గత ప్రభుత్వంలో ఇళ్లు కట్టుకున్నామని, మాకు ఇంత వరకు బిల్లులు మంజూరు కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా గత ప్రభుత్వంలో ఇలాంటి వారికి చంద్రబాబు రూ.600 కోట్లు హౌసింగ్ బిల్లులు పెండింగ్‌లో పెట్టామని సీఎం దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామన్నారు. త్వరలోనే మీకు న్యాయం చేస్తామన హామీ ఇచ్చారు. కేపీ ఉల్లి పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, లేకపోతే ఉల్లి రైతులు దళారుల ద్వారా తీవ్రంగా నష్టపోతారని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం రూ.4.90లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ కృష్ణయ్య, సచివాలయాల కన్వీనర్ శంకర్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చిరాకి బాషా, గోపిరెడ్డి బాబు, బొంతపల్లె సుబ్బారెడ్డి, శ్రీకాంత్, కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ నరసింహారెడ్డి, శ్రీనివాసులు, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు వెంకుపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం

మండలంలోని వెంకుపల్లె గ్రామంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరవుతారని తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించండి

మైదుకూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి, ఆదరించాలని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో అర్హులకు మంజూరైన కొత్త పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సెప్టెంబర్ నెలకు మైదుకూరు మున్సిపాలిటీలో కొత్తగా 121 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆ మేరకు ప్రభుత్వం సెప్టెంబర్ నెల నుంచి రూ.3.45 లక్షలను అదనంగా సొమ్మును మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలను, కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. విద్యార్థులు, మహిళలు, రైతుల కోసం నవరత్నాలు కార్యక్రమాలను అమలు చేస్తూ వెలుగు నింపుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ సొమ్మును అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర

ఘనంగా ఆరాధన

ప్రొద్దుటూరు కల్చరల్ : వసంతపేటలోని పాత రాఘవేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి ఆరాధన మహోత్సవాలు నిర్వహించారు.